క్లుప్తంగా

పశువులకు టీకాలు



టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని పెంచికల్‌పేట్ గ్రామంలో పశువుల్లో వచ్చే బ్రూసెల్లోస్ వ్యాధిని నివారించటానికి పశువైద్యాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవుదూడలకు, గేదెలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో పశువుల్లో వ్యాధిని నివారించటానికి పశుపోషకులు ఉచితంగా అందిస్తున్న టీకాలను పశువులకు వేయించాలని అన్నారు. పశువులకు వ్యాధులు సోకితే వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల కమల, సిబ్బంది సురేష్, శివ ఉన్నారు.

విద్యార్థుల కళాప్రదర్శన



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పెంచికల్‌పేట్: మండలంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో శుక్రవారం ఆర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వేషాధారణలతో తమ కళలను ప్రదర్శించారు. అంతకు ముందు విద్యార్థులకు ఫాన్సీ డ్రెస్, రైమ్స్, స్పీచ్, పాటల పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలతో పాఠశాల ఆవరణ కోలాహలంగా మారింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ అనిష్, జాన్సన్ ఉన్నారు.

వాసవీమాతకు పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని పేట్ మహెలా కాలనీలోని హనుమాన్ ఆలయంలో వాసవీమాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రోజుకో తీరుగా పూజలు చేస్తున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి సమ్మక్కజాతర



సమ్మక్క గద్దెల వద్ద భక్తులు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌తో పాటు దేవులగూడ సమీపంలో సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద శనివారం నుంచి సమ్మక్క సారలమ్మ మినీ జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. అమ్మవారి గద్దెలను రంగులతో అందంగా తయారు చేశారు. మహా జాతర తరహాలో వనదేవతలు గద్దెలపై కొలువుదీరే అవకాశం ఉండదని గద్దెల పూజారులు తెలిపారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు అమ్మల గద్దెల వద్ద మొక్కులు కొనసాగుతాయని తెలిపారు. జాతరను విజయవంతం చేయాలని కోరారు.

6 నుంచి కాంగ్రెస్ యాత్ర



మాట్లాడుతున్న రావి శ్రీనివాస్, నాయకులు

కౌటాల: ఈ నెల 6వ తేదీ నుంచి సిర్పూర్(టి) మండలంలోని టోంకిని గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు రావి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తలోడి గ్రామంలో పార్టీ మండల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపడుతున్న హాత్‌సే హాత్ జోడో యాత్రకు మద్దతుగా యాత్రను చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు బొర్కెట్ విఠల్, శ్రీనివాస్, దేవయ్య, సంతోష్, రవి, పుండలిక్, శ్రీకాంత్, శంకర్, రాంకుమార్, సంజీవ్ పాల్గొన్నారు.

ఆపదలో రక్తదానం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన మాడిశెట్టి ప్రశాంత్ అనే యువకుడు మహిళకు రక్తదానం చేసి ఆదుకున్నాడు. అత్యవసర పరిస్థితుల్లో రక్తహీనతతో బాధపడుతున్న మొహర్లె బూదేవికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం రక్తదానం చేశాడు. బ్లడ్ బ్యాంకులో 3వ సారి రక్తదానం చేసినట్లు, అత్యవసర పరిస్థితుల్లో ఎవరికైనా రక్తదానం అవసరముంటే సెల్ నెం. 9573854347 సంప్రదించాలని తెలిపారు.

నెరవేరని 'ఆశ'ల డిమాండ్లు



ధర్నాలో పాల్గొన్న ఆశవర్కర్లు (ఫైల్)

- ఆరోగ్య సేవలు అందించడంలో కీలకం
- సీఎం హామీ ఇచ్చినా పరిష్కారం కాని సమస్యలు
- ఆందోళనలో ఆశ వర్కర్లు

కాగజ్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఆందోళన బాట పడుతున్నారు. పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు జిల్లాలో 750 మంది ఆశ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరు గర్భిణులు, బాలింతలకు సేవలందించడంతో పాటు లెప్రసీ, బోధకాల సర్వే, చిన్నపిల్లల సర్వే, కుటుంబ సర్వే చేయడంతో పాటు బీపీ, షుగర్ రోగులకు నెల వారిగా మందులు అందించడంలో వీరి పాత్ర కీలకం. అంతేకాకుండా గ్రామీణులకు వైద్యపరంగా అవగాహన కల్పించడంలోనూ ముందుంటున్నారు. అయితే వీరితో అన్నిరకాల సేవలను చేయించుకుంటున్న ప్రభుత్వం వీరి డిమాండ్లు పరిష్కరించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలనే డిమాండ్‌తో 106 రోజులు సమ్మె చేయగా, సీఎం కేసీఆర్ ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించి ఫిక్సిడ్ వేతనంతో పాటు పలు డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకూ అమలుకు నోచుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్నట్లుగా నెలకు రూ.10 వేల ఫిక్సిడ్ వేతనం ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

డిమాండ్లు ఇవే...

- పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- గత ఏడాది డిసెంబర్ 6 నుంచి నిర్వహించిన లెప్రసీ సర్వేకు ప్రభుత్వం అదనంగా డబ్బులు చెల్లించాలి.
- జనవరి 18 నుంచి నిర్వహించిన కంటి వెలుగు పనికి అదనంగా డబ్బులు చెల్లించాలి.
- టీబీ సూటమి డబ్బాలను ఆశాలతో మోపించే పనిని రద్దు చేయాలి.
- పనిభారం తగ్గించాలి. జాబ్‌చార్ట్‌ను విడుదల చేయాలి.
- కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వేయి వంతున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలి.
- 32 రకాల రిజిష్టర్స్ ప్రింట్ చేసి ప్రభుత్వమే సరఫరా చేయాలి.
- క్వాలిటీతో కూడిన ఐదేళ్ల పెండింగ్ యూనిఫాంలను వెంటనే ఇవ్వాలి.
- ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి.

హామీలు నెరవేర్చాలి



తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రభుత్వం స్పందించి పది వేల రూపాయల ఫిక్సిడ్ వేతనాన్ని అందించాలి. పేద ప్రజలకు ఎన్నో రకాల సేవలను అందిస్తున్న తమను విస్మరించడం సమంజసం కాదు. పెండింగ్‌లోని బకాయిలు కూడా వెంటనే అందజేయాలి.

– స్వరూప, ఆశ కార్యకర్తల జిల్లా సంఘం అధ్యక్షురాలు

పనిభారం తగ్గించాలి



తమకు ప్రభుత్వం అన్ని రకాల విధులను కేటాయిస్తుంది. దీంతో తీవ్ర ఒత్తిడికి గురికావాల్సి వస్తుంది. పనిభారం తగ్గించడంతో పాటు తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి.

– పద్మ, ఆశ కార్యకర్తల జిల్లా సంఘం కార్యదర్శి

ఆశవర్కర్లకు మద్దతుగా ఉద్యమిస్తాం



ఆశవర్కర్లకు ఆందోళనలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుంది. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు వారికి అండగా ఉంటాం. వెంటనే అసెంబ్లీ సమావేశాల్లో ఆశ వర్కర్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

–ఆనంద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

భక్తిశ్రద్ధలతో పాదుకల ఊరేగింపు



హారతి ఇస్తున్న ఎమ్మెల్యే కోనప్ప దంపతులు



మహారాజ్ పాదుకల ఊరేగింపులో భక్తులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని కొత్తకాలనీ సమీపంలో శుక్రవారం నిర్వహించిన అనంత శ్రీ విభూషిత్ జగద్గురు రామానంద చార్య శ్రీస్వామి నరేంద్రచార్యజీ మహారాజ్ పాదుకల దర్శనం, ఉపాసక్ దీక్షలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని పెట్రోల్‌పంపు ఏరియా ప్రాంతంలోని ఓ నివాసంలో పాదుకల ప్రత్యేక పూజలు నిర్వహించి దౌనల్, గోవింద్‌పూర్, రైల్వే కాలనీల మీదుగా కొత్తకాలనీ సమీపంలోని దీక్ష మైదానం వరకు ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని భక్తులతో పాటు నియోజకవర్గంలోని సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, కాగజ్‌నగర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్ మండలాలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం వరకు పూజలు నిర్వహించారు. పలువురు ఉపాసక్ దీక్షలు పూనుకున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత సాధ్యమని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం అనంత శ్రీ విభూషన్ జగద్గురు రామానంద చార్య స్వామి శ్రీనరేంద్ర చార్యజీ మహారాజ్ పాదుక దర్శనం, ఉపాసిక్ దీక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భక్తిమార్గంతో మనిషి జీవన శైలి మారుతుందని, ప్రశాంతమైన జీవితాన్ని అలవర్చుకోవచ్చని అన్నారు. అనంతరం కోనేరు కోనప్ప -రమాదేవి ఎమ్మెల్యే దంపతులు పాదుక దర్శనం చేసుకుని హారతి ఇచ్చి ఉపాసిక్ దీక్షలో పాల్గొన్నారు. ఎంపీపీ చునార్కర్ సువర్ణ, వైస్ ఎంపీపీ ఈర్త సత్యనారాయణ, ఎంపీటీసీ ఎల్ములే సరిత, చింతలమానెపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, నాయకులు చునార్కర్ ఉమాజీ, చౌదరి నానాజీ, తుస్సే దౌలత్, రాజేందర్ పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



స్వామివారిని దర్శించుకుంటున్న అడిషనల్ ఎస్పీ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ బాజీపాయ్

రెబ్బెన(ఆసిఫాబాద్): గంగాపూర్‌లోని బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే జాతర ఏర్పాట్లను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ చాయత్ బాజ్‌పాయ్, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు వేర్వేరుగా పరిశీలించారు. జాతర సందర్భంగా తరలివచ్చే భక్తుల సంఖ్య చేసిన ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ మహిళల కోసం మొబైల్ టాయ్‌లెట్స్ సైతం పంపిస్తామని భక్తులు వినియోగించుకునేలా చూడాలన్నారు. స్వామి వారి రథోత్సవం, కల్యాణం వివరాలను తెలుసుకోవటంతో పాటు గుట్ట పైభాగం నుంచి ఆలయానికి దారి సౌకర్యంపై ఆరా తీశారు. జాతరలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకుంటున్న చర్యలతో పాటు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ అన్నారు. ఈవో బాపిరెడ్డి, ఎంపీటీసీలు మధునయ్య, శ్రీనివాస్, సర్పంచ్ పోషమల్లు, డీఈ రాజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో అంజద్‌పాషా, నాయకులువెంకటేశం, ఆనంద్, పోతురెడ్డి ఉన్నారు.

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం



కల్యాణలక్ష్మి చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల: రాష్ట్రంలోని పేదింటి ఆడ బిడ్డలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండలంలోని 86 మంది లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఎనిమిది మంది బాధిత రైతు కుటుంబాలకు రైతు బీమా చెక్కులను ఆయన పంపిణీ చేశారు. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం రైతుబంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. అంతకుముందు స్థానిక మినీ స్టేడియంలో కౌటాల ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఫోటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే కౌటాల మయూరి ప్రైవేట్ విద్యాలయానికి చెందిన విద్యార్థిని సత్తు యశస్విని ఇటీవల కిక్‌బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఆ బాలికను శాలువతో సన్మానించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీపీలు బి విశ్వనాథ్, డి.నానయ్య, కోఆప్షన్ సభ్యులు అజ్మత్, ఎంపీటీసీ మనీష్, ఉప సర్పంచ్ తిరుపతి, ఏఈఓలు అంజన్న, ఘన్‌శ్యాం, ఫొటోగ్రాఫర్లు శ్రీనివాస్, జీవన్, నాందేవ్, బాలు, శంకర్, భరత్, ప్రశాంత్, నాయకులు వెంకన్న, మధుకర్, రవీందర్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

కాగజ్‌నగర్‌రూరల్: ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పని కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వంజీరి రైతు వేదికలో ఉపాధి హామీ పనులపై నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏ ఒక్క కూలీ కూడా ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పని స్థలాల్లో రోజుకు రెండు సార్లు మొబైల్ యాప్‌ద్వారా హాజరును నమోదు చేయాలని, ఏ గ్రామంలో కూడా తమకు పని కల్పించడంలేదనే ఫిర్యాదులు వచ్చినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ గ్రామపంచాయతీలో వంద మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కుటుంబరావు, విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి, ఈసీ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మరమ్మతులు ఎప్పుడో..?



కాగజ్‌నగర్ నుంచి పెంచికల్‌పేట్‌కు వెళ్లే ప్రధాన రహదారిలోని నామానగర్ ఎర్రవాగు వంతెనకు మరమ్మతులకు నోచుకోక ప్రమాదకరంగా మారింది. వంతెన రెయిలింగ్‌కు ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. 2015లో కాగజ్‌నగర్ నుంచి బెజ్జూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వంతెన వద్దకు రాగానే ప్రధాన పట్టీ విరిగిపోయి రెయిలింగ్‌ను ఢీకొట్టి వాగులో పడిపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు వంతెనకు మరమ్మతులు చేపట్టలేదు. రెయిలింగ్ లేకపోవడంతో వంతెన వద్ద భయంభయంగా ప్రయాణాన్ని కొనసాగించాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

– కాగజ్‌నగర్ రూరల్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

వాంకిడి: తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న అంగన్‌వాడీలు అధికంగా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే ఉన్నారని, 40 ఏళ్లుగా ఐసిడిఎస్‌లో పనిచేస్తున్నప్పటికీ కనీస వేతనం, పెన్షన్, ఈఎస్, ఉద్యోగ భద్రత, వంటి చట్టబద్ధ సౌకర్యాలేవి ఇప్పటివరకు ప్రభుత్వం కల్పించలేదని, దీంతో అంగన్‌వాడీ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించకపోతే మార్చి 1, 2, 3 తేదీల్లో మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఉమాదేవి, వీణ, సునిత, లక్ష్మి ఉన్నారు.

చెట్లకిందనే ఎదురుచూపు..

- బస్టాండ్ లేక ప్రయాణికుల అవస్థలు
- వర్షాకాలం, ఎండకాలంలో తీవ్ర ఇబ్బంది
- ఇకనైనా బస్టాండ్ నిర్మించాలని ప్రయాణికుల వేడుకోలు



బెజ్జూర్‌లో బస్సులు నిలిపే ప్రదేశం

బెజ్జూర్: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం.. క్షేమంగా గమ్యానికి చేరుకోండి.. ఈ బస్సు మన అందరిది.. అంటూ ప్రచారం నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు బస్సుల్లో ప్రయాణించే వారి కష్టాలను మాత్రం గాలికొదిలేస్తున్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండాకాలంలో ఎండుతూ, వానకాలంలో తడుస్తూ, చలికాలంలో వణుకుతూ బస్సుల రాక కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి. దశాబ్దాలుగా మండల ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. అయినప్పటికీ వా రి సమస్యలను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు.

కలగానే బస్టాండ్ నిర్మాణం..

బెజ్జూర్ మండల వాసులకు బస్టాండ్ నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. పనుల నిమిత్తం ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు బస్సుల రాక కోసం చెట్ల కింద, హోటళ్లలో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. 1984లో బెజ్జూర్ మండలం ఏర్పడింది. ఆ సమయంలో 23 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఉమ్మడి బెజ్జూర్ మండలంలో పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి మండలాలు బెజ్జూర్‌లో ఉండేవి. అప్పటినుంచి ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలు మారినా బెజ్జూర్ మండల కేంద్రంలో బస్టాండ్ మాత్రం నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఉండే ఈ ప్రాంతంలో బస్టాండ్ ని ర్మాణం చేపట్టాలనే డిమాండ్ ఉన్నప్పటికీ అ ధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించడం లేదని మండల వాసులు పేర్కొంటున్నారు.

బస్టాండ్ నిర్మాణానికి నిధుల మంజూరు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే బెజ్జూర్ మారుమూల మండలంగా చెప్పుకోవచ్చు. అప్పటి ఎంపీ మధుసూదన్ రెడ్డి రూ.60 వేలు మంజూరు చేయించారు. అయితే నిర్మాణానికి నిధులు సరిపోవని ఎవరు ముందుకు రాలేదు. దీంతో ఆ నిధులు వెనక్కి వెళ్లాయి. అప్పట్లో బస్టాండ్ నిర్మాణం జరుగుతుందని సంబరపడిన ప్రజలు ఆ పనులు జరగకపోవడంతో నిరాశకు గురయ్యారు. దీంతో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని పలువురు పేర్కొంటున్నారు.

స్వరాష్ట్రంలోనూ అవే కష్టాలు..

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో జిల్లాల పునర్విభజనలో భాగంగా కొన్ని నూతన మండలాలను ఏర్పాటు చేశారు.బెజ్జూర్ మండలం నుంచి కొన్ని గ్రామపంచాయతీలు కొత్తగా ఏర్పాటైన పెంచికల్‌పేట, చింతలమానేపల్లి మండలాల్లో విలీనమయ్యాయి. అభివృద్ధి మాత్రం జరగలేదు. జనాభా లెక్కల ప్రకారం.. మండలంలో 22 గ్రామపంచాయతీలు, 51 గ్రామాలు ఉన్నాయి. ఇందులో 7,326 నివాసాలు ఉండగా, 14,762 మహిళలు, 14,345 మంది పురుషులు ఉన్నారు.

బస్టాండ్ నిర్మించాలి



మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలి. బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బస్సుల కోసం చెట్ల కింద, హోటళ్ల చాటున నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వృద్ధులు, చిన్నారులు, మహిళల పరిస్థితి దారుణం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- జి.భిక్షమయ్య, బెజ్జూర్

ఇబ్బంది పడుతున్నాం



వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇక్కడ బస్సుల రాక కోసం వేచి చూసేందుకు బస్టాండ్ లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం. వేసవి, వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. నూతన బస్టాండ్ నిర్మించేందుకు కృషి చేయాలి.

- తాజొద్దీన్, బెజ్జూర్

సమ్మక్కకు భక్తుల పూజలు

ఆసిఫాబాద్‌రూరల్:జిల్లా కేంద్రంలో పెద్ద వాగు సమీపంలో సమ్మక్క సారలమ్మకు శుక్రవారం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 5వ తేదీన సారలమ్మ గద్దెపై పగిడిద్దరాజుతో సమ్మక్క దేవి కల్యాణం ఉంటుందని ఆలయ పూజారి రమేష్ తెలిపారు.